# సాక్షి ఆదిలాబాద్

శనివారం ¦ 14 ¦ అక్టోబర్ ¦ 2023






**శరన్నవరాత్రి ఏర్పాట్లు**

బాసరలో రేపటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. దసరా వరకు కొనసాగనున్నాయి. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. IVలో▸



**ఘనంగా బతుకమ్మ వేడుకలు**

బతుకమ్మ వేడుకలను జిల్లా కేంద్రంలోని పలు కళాశాలల్లో ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మల చుట్టూ తిరుగుతూ ఆడిపాడారు. IIIలో▸

**వాతావరణం**

గరిష్టం/కనిష్టం 35.0 /22.0

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం కనిపిస్తుంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

# ఉల్లంఘనులపై కొరడా

- పోలీసులు, టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో..
- సరిహద్దుల్లో పెరిగిన నిఘా
- చెక్‌పోస్టుల్లో ముమ్మర తనిఖీలు
- బెల్టుషాపులపై విస్తృత దాడులు
- భారీగా నగదు, మద్యం స్వాధీనం
- ఇప్పటికే పలువురిపై కేసులు



బెల్టుషాపు నుంచి సీజ్ చేసిన మద్యంతో పోలీసులు

ఆదిలాబాద్‌టౌన్: ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై పోలీసుశాఖతో పాటు టాస్క్‌ఫోర్స్ బృందాలు కొరడా ఝులిపిస్తున్నాయి. నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. ఇటీవల ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన విషయం తెలిసిందే. దీంతో పోలీసు, రవాణ, ఎక్సైజ్, రెవెన్యూ, అటవీ, ఐటీ శాఖలు సమన్వయమై అక్రమార్కులపై నిఘా పెంచారు. చెక్‌పోస్టులను దాటే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి పత్రాలు లేని డబ్బును సీజ్ చేస్తున్నారు. అక్రమంగా మద్యం తరలిస్తే వాటిని స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తున్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా జిల్లా యంత్రాంగం ముందుకు సాగుతోంది. ఇప్పటికే మద్యంతో పాటు అక్రమంగా తరలిస్తున్న డబ్బును సీజ్ చేశారు. రెండు,మూడు రోజుల్లోనే రూ.19లక్షల నగదుతో పాటు 666 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. నియమావళిని ఉల్లంఘిస్తే ఎవరిని ఉపేక్షించేది లేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

**'బెల్టు' తీస్తున్నారు..**

జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో గల బెల్టుషాపుల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారిపై పోలీసులు, ఎక్సైజ్ శాఖాధికారులు దాడులు జరుపుతున్నారు. నిల్వ ఉన్న సరుకును స్వాధీనం చేసుకోవడంతో పాటు నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తున్నారు. జిల్లాలోని ఆయా గ్రామాల్లో రెండు రోజులుగా విస్తృతంగా దాడులు చేస్తున్నారు. అక్రమ మద్యానికి సంబంధించి 102 మంది నిందితులను అరెస్టు చేశారు. పట్టుబడిన మద్యం విలువ రూ.4లక్షల 63వేలు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఆదిలాబాద్ పట్టణంతో పాటు మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల గ్రామాల్లో దాడులు నిర్వహిస్తుండగా, దేశీదారుతో పాటు ఇతర మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉండగా ఇంకా చాలా గ్రామాల్లో బెల్టుషాపుల నిర్వహణ కొనసాగుతుంది. ఎన్నికలు సమీపిస్తుండడంతో వీరు ముందుగానే మద్యం నిల్వ ఉంచుతున్నట్లు సమాచారం.

**చెక్‌పోస్టుల ఏర్పాటు..**

ఎన్నికల ప్రక్రియలో భాగంగా జిల్లాలో తనిఖీలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఏడు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. జైనథ్ మండలంలోని పిప్పర్‌వాడ, ఆనంద్‌పూర్, కరంజి, బేల మండలంలోని శంకర్‌గూడ, బోథ్ మండలంలోని ఘన్‌పూర్, తలమడుగు మండలంలోని లక్ష్మీపూర్, ఆసిఫాబాద్ జిల్లాలోని మేడిగూడ ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశారు. అలాగే జిల్లాలోని రోల్‌మామడ, జైనూర్ ఎక్స్‌రోడ్, కొమ్ముగూడ వద్ద మూడు అంతర్ జిల్లా చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో 24 గంటల పాటు తనిఖీలు కొనసాగుతున్నాయి. వీడియో రికార్డింగ్ చేస్తున్నారు. అలాగే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎస్పీ, కలెక్టర్ కార్యాలయాలకు అనుసంధానం చేశారు.

**నిఘా పెంచాం..**

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సరిహద్దులో నిఘాం పెంచాం. అంతర్రాష్ట్ర, అంతర్ జిల్లా చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి క్షుణ్ణంగా వాహనాలు తనిఖీ చేస్తున్నాం. నిబంధనలు ఉల్లంఘించిన వారిని గుర్తిస్తున్నాం. అక్రమంగా డబ్బు, మద్యం తరలిస్తే వాటిని స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తున్నాం. ఎక్కడ కూడా బెల్టు షాపులు నిర్వహించకూడదు. అలాగే ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించ కూడదు.

– డి.ఉదయ్‌కుమార్ రెడ్డి, ఎస్పీ

| |
|---|
| నమోదైన మద్యం కేసులు: 101 |
| స్వాధీనం చేసుకున్న మద్యం: 666 లీటర్లు |
| సీజ్ చేసిన డబ్బు: రూ.19,41,710 |
| ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు: 10 |
| అంతర్రాష్ట్ర: 03, అంతర్‌జిల్లా : 07 |

**రూ.19లక్షల నగదు సీజ్..**



వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

ఎన్నికల నియమావళి అమలులోకి రావడంతో పోలీసు అధికారులు వాహనాలను విస్తృతంగా తనిఖీ చేస్తున్నారు. నిబంధనల ప్రకారం రూ.50వేలకు మించి నగదు తరలించడానికి వీలులేదు. ఒకవేళ సరైన పత్రాలు ఉంటే అనుమతిస్తామని అధికారులు చెబుతున్నారు. రాత్రి వేళల్లో ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేట్ ట్రావెల్స్‌ను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. పత్రాలు లేకుండా నగదు తరలిస్తే వాటిని సీజ్ చేసి ఐటీ శాఖకు అప్పగిస్తున్నారు. ఈ కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి జిల్లాలో 19లక్షల 41వేల 710 స్వాధీనం చేసుకున్నారు.

## పీఏసీఎస్ డబ్బులు దుర్వినియోగం

- గూడ రాంపూర్ సొసైటీ చైర్మన్‌పై వేటు
- బ్యాంక్ డైరెక్టర్ పదవి కూడా..

సాక్షి,ఆదిలాబాద్: జైనథ్ మండలం గూడరాంపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్ పురుషోత్తంపై వేటు పడింది. 15 రోజుల క్రితం ఆయన పదవిని డిస్‌క్వాలిఫై చేస్తూ డీసీవో మోహన్ నుంచి ఉత్తర్వులు వెలబడ్డాయి. సొసైటీకి చెందిన డబ్బుల దుర్వినియోగానికి బాధ్యుడిని చేస్తూ ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే ఈ విషయం గోప్యంగా ఉంచారు. తాజాగా ఆ దుర్వినియోగానికి సంబంధించిన డబ్బులను సర్దుబాటు చేయడం ద్వారా అనర్హత వేటు నుంచి తప్పించాలనే యత్నాలు ఓ నేత చేస్తున్నారన్న ప్రచారం ప్రాధాన్యత సంతరించుకుంది. సొసైటీలకు మార్క్‌ఫెడ్ నుంచి యూరియా, డీఏపీ సరఫరా చేయడం జరుగుతుంది. వీటిని విక్రయించిన తర్వాత ఆ డబ్బులను మార్క్‌ఫెడ్‌కు చెల్లించాలి. అయితే రూ.11లక్షలకు సంబంధించి నిధులను ఈ సొసైటీ పరంగా మార్క్‌ఫెడ్‌కు చెల్లించకపోవడంతో ఆరు నెలల క్రితం జిల్లా కోఆపరేటీవ్ అధికారి నుంచి నోటీసు జారీ చేశారు. అయినప్పటికీ స్పందన లేకపోవడంతో సర్‌చార్జి ఆర్డర్ కూడా జారీ చేశారు. దీనిపై కూడా స్పందన లేకపోవడంతో పక్షం క్రితం గూడరాంపూర్ పీఏసీఎస్ చైర్మన్ పురుషోత్తంను డిస్‌క్వాలిఫై చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు డీసీవో మోహన్ 'సాక్షి'కి తెలిపారు. ఇదిలా ఉంటే ప్రస్తుతం ఆయన డీసీసీబీ డైరెక్టర్‌గానూ కొనసాగుతున్నారు. చైర్మన్ పదవికి అనర్హుడు కావడంతో డైరెక్టర్ పదవి పరంగానూ ప్రభావం చూపుతుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 77 పీఏసీఎస్‌లు ఉండగా ఇటీవల పలు సొసైటీల్లో ఇలాంటి దుర్వినియోగాలు చోటుచేసుకున్నాయి. ప్రధానంగా కీలక బాధ్యతల్లో ఉన్నవారు ఈ డబ్బులను సొంతానికి వినియోగించుకోవడం, ప్రభుత్వ రంగ సంస్థలకు చెల్లించకపోవడం వంటి పరిణామాలు జరుగుతున్నాయి.

## న్యూస్‌రీల్

### ముగిసిన కానిస్టేబుల్ సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన శుక్రవారంతో ముగిసింది. జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో ఈ ప్రక్రియ సాగింది. 97 మంది అభ్యర్థులకు గాను ఇద్దరు గైర్హాజరయ్యారు. 15 మంది ఫైర్ అభ్యర్థులకు గాను ఒకరు హాజరు కాలేదు. ముగ్గురు జైల్‌వార్డెన్ అభ్యర్థులు, ఇద్దరు ఐటీ అండ్ కమ్యూనికేషన్ అభ్యర్థులు, ఏడుగురు ఎక్సైజ్ అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా ఒకరు గైర్హాజరయ్యారు. తొలిరోజు సివిల్ అభ్యర్థులు 149 మందికి నలుగురు హాజరుకాలేదు. 84 ఏఆర్ అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా ఒకరు గైర్హాజరయ్యారు. సర్టిఫికెట్ పరిశీలన ప్రక్రియ ముగియడంతో తర్వాత మెడికల్ టెస్టు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు సంజీవ్‌కుమార్, పోతరాజు, ఆశన్న, ప్రసాద్, దయానంద్, పద్మ, సునీత పాల్గొన్నారు.

### అధిక కేసుల పరిష్కారానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి వరప్రసాద్

ఆదిలాబాద్‌టౌన్: జాతీయ లోక్‌అదాలత్‌లో అధిక కేసులు పరిష్కారమయ్యే విధంగా కృషి చేయాలని జిల్లా జడ్జి వీఆర్‌ఆర్ వరప్రసాద్ అన్నారు. జిల్లా కోర్టులో న్యాయవాదులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడు తూ, పెండింగ్ కేసుల విషయంలో న్యాయవాదులు చొరవ చూపాలని సూచించారు. డిసెంబర్ 9న నిర్వహించే లోక్‌అదాలత్‌లో టాప్–10లో ఉండే విధంగా కృషి చేయాలన్నారు. ఆదిలాబాద్ జిల్లాకు అ డిషనల్ డిస్ట్రిక్ట్ కోర్టుతో పాటు అడిషనల్ సివిల్ కోర్టు మంజూరైందని తెలిపారు. ప్రస్తుతం వాటి ప నులు కొనసాగుతున్నాయన్నారు. కేసుల పరిష్కారంలో న్యాయవాదులు తమవంతు సహకారం అందిస్తూ పెండింగ్ లేకుండా చూడాలని తెలిపారు. సమావేశంలో జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి శివరాం ప్రసాద్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే, జడ్జి ప్రమిళజైన్, న్యాయవాదులు పాల్గొన్నారు.

### పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌వో

బోథ్: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని బోథ్ ఎన్నికల అధికారి, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. మండలంలోని తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులో గల ఘన్‌పూర్ చెక్‌పోస్టును శుక్రవారం ఆమె సందర్శించారు. వాహనాల తనిఖీ తీరును పరిశీలించారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం సొనాల, కొత్త గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆమె వెంట డీటీ సూరజ్ రావు, సిబ్బంది ఉన్నారు.

### రాష్ట్ర హాకీ జట్టు కోచ్‌గా జిల్లా వాసి

ఆదిలాబాద్: తెలంగాణ రాష్ట్ర బాలికల హాకీ జట్టు కోచ్‌గా జిల్లాకు చెందిన వై.శేఖర్ వ్యవహరించనున్నారు. ఈనెల 17నుంచి 24వరకు తమిళనాడు రాష్ట్రంలో నిర్వహించనున్న హాకీ ఇండియా సబ్ జూనియర్ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్న రాష్ట్ర బాలికల జట్టుకు ఈయన శిక్షకుడిగా కొనసాగనున్నారు. ఈయన ప్రస్తుతం ఉట్నూరు గిరిజన సంక్షేమ ఆదర్శ క్రీడా పాఠశాలలో హాకీ శిక్షకుడిగా విధులు నిర్వహిస్తున్నాడు.

### పోస్టర్ విడుదల

బోథ్: ఈ నెల 15 నుంచి 17 వరకు మహబూబ్‌నగర్‌లో నిర్వహించనున్న డీటీఎఫ్ ఐదో రాష్ట్ర విద్య, వైజ్ఞానిక రజతోత్సవాలను విజయవంతం చేయాలని సంఘం నాయకులు కోరారు. ఈమేరకు వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఇందులో సంఘం నాయకులు మురళీధర్, రాజేశ్వర్‌రెడ్డి, గణపతి, ప్రేమ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలి

- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



రోల్‌మామడ చెక్‌పోస్టు వద్ద అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ

నేరడిగొండ: ఎన్నికల దృష్ట్యా అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని రోల్‌మామడ చెక్‌పోస్టును శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. పోలీసు అధికారులు, సిబ్బందికి తగు సూచనలు చేశారు.ఓటర్లను ప్రభావితం చేసే వస్తువులు, డబ్బు, మద్యం ఇతర త్రావి తరలించకుండా చూడాలన్నారు. రవాణా, ఎక్సైజ్, రెవెన్యూ, ఫారెస్ట్ శాఖలు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. అనంతరం నేరడిగొండ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఆవరణలో మొక్క నాటారు. కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని సూచించారు. ఎస్పీ వెంట ఉట్నూర్ డీఎస్పీ సీహెచ్ నాగేందర్, ఇచ్చోడ సీఐ చంద్రశేఖర్, ఎస్సై సాయన్న, స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ఘన్‌పూర్ చెక్‌పోస్టు తనిఖీ**

బోథ్: మండలంలోని తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులో గల ఘన్‌పూర్ చెక్‌పోస్టును ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సిబ్బందికి సూచించారు. ఎస్పీ వెంట బోథ్ సీఐ భీమేష్, ఎస్సై రాము, సిబ్బంది ఉన్నారు

## గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న పీవో చాహత్ బాజ్‌పాయ్

ఇచ్చోడ: క్రీడల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో ఏడో జోనల్‌స్థాయి క్రీడా పోటీలను శుక్రవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్, మెదక్ రీజియన్లలోని 10 గిరిజన గురుకుల బాలికల పాఠశాలల విద్యార్థులు ఇందులో పాల్గొంటున్నట్లు తెలిపారు. గురుకులాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు క్రీడల్లో రాణించేలా ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా పలువురు విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 15 వరకు పోటీలు కొనసాగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గురుకులాల ఆర్సీవో గంగాధర్, ఐటీడీఏ ఈఈ రాథోడ్ భీంరావు, పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రావు, బాలుర కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, ఆదిలాబాద్ ప్రిన్సిపాల్ అగస్టిన్, స్టార్ ఫిఫ్టీ ఫిఫ్టీ ప్రిన్సిపాల్ మారుతీశర్మ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ లొల్లి!

- కాంగ్రెస్, బీజేపీలో పెరిగిన డిమాండ్
- 'హస్తం' లో సుజాత, 'కమలం' పార్టీలో శంకర్..
- ఆశావహుల్లో టికెట్ టెన్షన్
- ఆసక్తికరంగా తాజా రాజకీయాలు



గండ్రత్ సుజాత



పాయల్ శంకర్

సాక్షి,ఆదిలాబాద్: రాష్ట్ర రాజకీయాల్లో కాంగ్రెస్, బీజేపీలో జరుగుతున్న ప్రస్తుత పరిణామాలు జిల్లాకు కూడా అన్వయించుకునే పరిస్థితి ఉంది. ప్రధానంగా కాంగ్రెస్‌లో బీసీలకు 34 సీట్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. మరో పక్క కమలం పార్టీ బీజేపీ జెండా.. బీసీలకు అండ నినాదంతో ముందుకెళ్లాలనే యోచన కూడా చర్చనీయాంశంగా మారింది. అసెంబ్లీ టికెట్ల పరంగా 40కి పైగా స్థానాల్లో బీసీలకు కేటాయించే యోచన ఆ పార్టీ చేస్తుందన్న లీకులు ఇక్కడి శ్రేణుల్లో ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. ప్రధానంగా ఆదిలాబాద్ జిల్లా పరంగా చూస్తే బోథ్, ఖానాపూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాలు ఎస్టీ రిజర్వుడ్ కాగా, ఆదిలాబాద్ నియోజకవర్గం జనరల్ కేటగిరీలో ఉంది. ఈ క్రమంలో ఈ నియోజకవర్గంపైనే అందరి దృష్టి కనిపిస్తుంది.

**ప్లస్.. మైనస్**

ఆదిలాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీజేపీల పరంగా టికెట్ ఆశిస్తున్న బీసీ నేతలకు గతంలో పలుమార్లు పోటీచేసి ఓటమి చెందడం మైనస్‌గా ఉంది. కాంగ్రెస్ పరంగా మహిళా బీసీ నేత గండ్రత్ సుజాత టికెట్ ఆశిస్తున్నారు. తాజాగా రాష్ట్రంలో ఆ పార్టీ అభ్యర్థుల జాబితా ఏ క్షణాన్నైనా ఖరారయ్యే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది. అయితే ఇక్కడి నుంచి కంది శ్రీనివాస్‌రెడ్డి పేరు కొద్ది రోజులుగా తెరపైకి వస్తుంది. ఇదిలా ఉంటే పీసీసీ మాజీ అధ్యక్షుడు, బీసీ నేత పొన్నాల లక్ష్మయ్య హస్తం పార్టీకి రాజీనామా చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. టికెట్ల అంశం తుది దశకు చేరుకున్న పరిస్థితుల్లో ఆయన రాజీనామా పార్టీలో దుమారం లేపుతోంది. ఈ నేపథ్యంలో ముందుగా అనుకున్నట్టే కాంగ్రెస్ జాబితా ఉంటుందా, లేనిపక్షంలో ఏదైనా మార్పుచేర్పులు ఉంటాయా అనేది ఆసక్తికరంగా మారింది. అయితే సుజాత టికెట్ ఆశిస్తున్నప్పటికీ గతంలో ఆమె కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. అంతకుముందు 1999లోనూ పార్టీ నుంచి పోటీ చేసి పరాజయం పాలయ్యారు. ఇలా ఆమె రెండు సార్లు ఓటమిపాలైన క్రమంలో ఈ సారి అధిష్టానం ఆమె వైపే మొగ్గ చూపుతుందా.. టికెట్ మరొకరికి కేటాయిస్తుందా అనేది సస్పెన్స్‌గా మారింది. ఇక ఆదిలాబాద్ బీజేపీలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, బీసీ నేత అయిన పాయల్ శంకర్ టికెట్‌ను ఆశిస్తున్నారు. మరోపక్క జెడ్పీ మాజీ చైర్‌పర్సన్, మహిళా నేత చిట్యాల సుహాసినిరెడ్డి నుంచి ఆయనకు పోటీగా ఉన్నారు. ఈసారి బీసీలకు అండగ నినాదంతో పార్టీ ముందుకొస్తుందా అన్న చర్చ సాగుతుండగా, ఇక్కడ ఎలా ఉంటుందనేది బేరీజు వేసుకునే పరిస్థితులు ఉన్నాయి. గతంలో శంకర్ కూడా ఓసారి ఉప ఎన్నికల్లో టీడీపీ పరంగా, రెండుసార్లు బీజేపీ నుంచి అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఈ నేపథ్యంలో ఈ నియోజకవర్గంలో ఆయా పార్టీల అధిష్టానాల దృష్టి ఏ విధంగా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది.

## రాజకీయాల నుంచి తప్పుకున్న 'లోక'

- తెలంగాణ ఉద్యమంలో ముందుండి పోరాటం
- 1978లో పొలిటికల్ ఎంట్రీ ఇచ్చిన భూమారెడ్డి



లోక భూమారెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, విజయ డెయిరీ డెవలప్‌మెంట్ మాజీ చైర్మన్ లోక భూమారెడ్డి రాజకీయాల నుంచి తప్పుకున్నట్లు శుక్రవారం ప్రకటించారు. ఈయన తెలంగాణ ఉద్యమంలో ముందుండి పోరాటం చేశారు. బీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి కొనసాగుతున్నారు. వయస్సు పైబడడంతో రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయం తీసుకున్నట్లు 'సాక్షి'తో పేర్కొన్నారు. 1978లో కాంగ్రెస్ పార్టీతో రాజకీయాల్లోకి అడుగుపెట్టి పలు పదవుల్లో కొనసాగారు. 1981 నుంచి 1992 వరకు తలమడుగు మండలం రుయ్యాడి సర్పంచ్‌గా కొనసాగగా, ఆ సమయంలో పంచాయతీకి ఐదుసార్లు ఉత్తమ అవార్డులు దక్కాయి. 1992లో డీసీసీబీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఈయన చైర్మన్‌గా పనిచేసిన కాలంలో మూడు సార్లు (1992, 1993, 1995) ఉత్తమ బ్యాంక్‌గా అవార్డులు దక్కాయి. 2001లో బీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు కొనసాగారు. 2017 ఫిబ్రవరి 17న రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ చైర్మన్‌గా నియామకం అయ్యారు. ఐదేళ్లపాటు ఈ పదవిలో కొనసాగారు. అలాగే జిల్లా అధ్యక్షుడిగా 2021 వరకు పనిచేశారు. ప్రస్తుతం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్నారు. అయితే ఇటీవల ఆయనకు పార్టీలో తగిన గుర్తింపు లేకపోవడంతో కొంత కాలంగా అంటిముట్టనట్టుగా ఉన్నట్లు తెలుస్తోంది. తాజాగా రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించడంతో ఆ పార్టీలో చర్చ సాగుతోంది. ఈ విషయమై లోక భూమారెడ్డిని అడగగా, తాను రాజకీయాల నుంచి తప్పుకుంటున్నానని, మరే కారణం లేదని స్పష్టం చేశారు.

## 16 నుంచి 'ఓపెన్' పరీక్షలు

- పకడ్బందీగా ఏర్పాట్లు
- డీఈవో ప్రణీత



మాట్లాడుతున్న డీఈవో ప్రణీత

ఆదిలాబాద్‌టౌన్: ఓపెన్ స్కూల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డీఈవో ప్రణీత అన్నారు. పరీక్షల నిర్వహణపై సీఎస్, డీవోలతో డీఈవో కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈనెల 16 నుంచి 26 వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయని తెలిపారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. పదో తరగతి పరీక్షకు 324 మంది, ఇంటర్మీడియెట్ పరీక్షలకు 165 మంది హాజరు కానున్నట్లు వివరించారు. పదో తరగతి కోసం రెండు పరీక్ష కేంద్రాలు, ఇంటర్ కోసం ఒక కేంద్రాన్ని జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అభ్యర్థులు అరగంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని, పరీక్ష ప్రారంభమైన 5 నిమిషాల తర్వాత లోనికి అనుమతి ఉండదని పేర్కొన్నారు. సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. అధ్యయన కేంద్రాలతో పాటు వెబ్‌సైట్ ద్వారా కూడా హాల్‌టికెట్లను పొందవచ్చని సూచించారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఈనెల 30 నుంచి నిర్వహిచనున్నట్లు పేర్కొన్నారు. విషయాన్ని అభ్యర్థులు గమనించాలని సూచించారు. సమావేశంలో ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ అశోక్, సీఎస్, డీవోలు పాల్గొన్నారు.

## అందుబాటులోకి మీడియా సెంటర్

- ప్రారంభించిన కలెక్టర్ రాహుల్‌రాజ్
- 'ఎంసీఎంసీ' ద్వారా పెయిడ్‌న్యూస్ గుర్తింపు



మీడియాసెంటర్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కై లాస్‌నగర్: ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా అందించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియాసెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) సెల్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు అందించనున్నట్లు తెలిపారు. ఈ కమిటీ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించనున్నట్లు చెప్పారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అతిక్రమించి పెట్టే పోస్టులపై చట్టప్రకారం చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీపీఆర్వో విష్ణువర్ధన్, తహసీల్దార్ శ్రీనివాస్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

**చెల్లింపు వార్తలను క్షుణ్ణంగా పరిశీలించాలి**

ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చిన రాజకీయ పార్టీల చెల్లింపు వార్తలను క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఎంసీఎంసీ సభ్యులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చిన చెల్లింపు వార్తలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు సంబంధించిన ప్రకటనలు, ప్రచురణ ముందస్తు అనుమతి లేకుండా ప్రసారం చేయడం వంటి ప్రక్రియను గమనించాలన్నారు. అలాగే సోషల్ మీడియాలో ప్రతికూల, అనుకూల ప్రకటనలకు కూడా పరిశీలించాలని ఆదేశించారు. దరఖాస్తు చేసుకున్న అన్ని రకాల ప్రకటనలను కమిటీ ద్వారా పరిశీలించి సకాలంలో అనుమతులు మంజూరు చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు కుష్బూ గుప్తా, శ్యామలాదేవి, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### నేడు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం

ఆదిలాబాద్‌టౌన్‌: విద్యుత్‌ మరమ్మతు పనుల కారణంగా పట్టణంతో పాటు పలు మండలాల్లో శనివారం విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌ శాఖ ఎస్‌ఈ సంపత్‌కుమార్‌ ఒక ప్రకటనలో తెలిపారు. రిమ్స్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, భుక్తాపూర్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, సీసీఐ సబ్‌స్టేషన్‌ పరిధిలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, అంకోలి సబ్‌స్టేషన్‌ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

### సాహస ఉద్యోగులకు 'ప్రశంస'



సజ్జనార్‌ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకుంటున్న భగవంత్‌రావు, శ్రీనివాస్‌

కుంటాల: మండల కేంద్రానికి చెందిన మేసినేని భగవంత్‌రావు భైంసా డిపోలో సెక్యూరిటీ హెడ్‌కానిస్టేబుల్‌గా, ఆదిలాబాద్‌కు చెందిన శ్రీనివాస్‌ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. వానాకాలంలో కురిసిన భారీ వర్షం కారణంగా డిపోలోకి వరద నీరు రాగా, వీరు సాహసం చేసి వరదలో చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీసి రక్షించారు. వీరి సేవలను ప్రభుత్వం గుర్తించింది. ఇటీవల హైదరాబాద్‌లో ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌ వీరికి ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. వీరికి ఆర్‌ఎం సోలోమాన్‌ రాజ్‌, భైంసా డీఎం అమృత అభినందనలు తెలిపారు.

### క్రెడిట్‌కార్డ్‌ హ్యాక్‌ చేసి డబ్బులు కాజేసిన మోసగాళ్లు

సోన్‌: మండలంలోని మాధాపూర్‌ గ్రామానికి చెందిన బర్మా దేవన్న ఏటీఎం ద్వారా సైబర్‌ నేరస్తులు హ్యాక్‌ చేసిన రూ.1,23,270 నగదును పోలీసులు రికవరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవన్న వారం క్రితం ఏటీఎంలో డబ్బులు డ్రా చేద్దామని వెళ్లాడు. డెబిట్‌ కార్డుకు బదులు క్రెడిట్‌ కార్డు పెట్టగా కార్డు బ్లాక్‌ అయినట్లు వచ్చింది. తన అకౌంట్‌ నుంచి సైబర్‌ నేరగాళ్లు తన డబ్బులను హ్యాక్‌ చేశారని పోలీస్‌స్టేషన్‌ సైబర్‌ క్రైమ్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై రవీందర్‌ సీసీటీఎన్‌ఎస్‌ రైటర్‌ రాజు పిటిషన్‌ అప్లోడ్‌ చేసి రోజువారీగా మానిటర్‌ చేస్తూ సైబర్‌ నేరగాళ్ల అకౌంట్‌ హోల్డ్‌ చేసిన పూర్తి డబ్బులు తిరిగి బాధితుడి అకౌంట్‌లోకి రికవరీ చేయించారు.

### మద్యం పట్టివేత

బోథ్‌: మండలంలోని పలు ప్రాంతాల్లో ఎస్సై రాము ఆధ్వర్యంలో గురువారం రాత్రి సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలో భారీగా మద్యం లభ్యమైంది. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి పలు గ్రామాల్లో సోదాలు నిర్వహించారు. కనుగుట్ట గ్రామంలో కుమ్మరి నరేందర్‌, బీరం పోశెట్టి వద్ద రూ.2,333, ధన్నూర్‌ బీ గ్రామంలో దోపతి నవీన్‌ వద్ద రూ.54,873, సొనాలలో రమేశ్‌ వద్ద రూ.3,909, గుర్రాలతండా గ్రామంలో చౌహాన్‌ సంజయ్‌ వద్ద రూ.4,899 విలువైన అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం పట్టుబడింది. నాగాపూర్‌ గ్రామంలో జాదవ్‌ రామారావ్‌ వద్ద ఐదు లీటర్ల గుడుంబా లభించింది. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఎవరూ అక్రమంగా మద్యం విక్రయించరాదని తెలిపారు. నిరంతరం తాము తనిఖీలు నిర్వహించి అక్రమంగా మద్యం విక్రయించేవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

# కల్తీ కట్టడే ప్రధానం

- వస్తు వినియోగంలో నాణ్యత కీలకం
- నేడు ప్రపంచ ప్రమాణాల దినోత్సవం

- నిర్మల్‌ జిల్లా కేంద్రానికి చెందిన సురేశ్‌ వంటనూనె కొనడానికి ఓ సూపర్‌ మార్కెట్‌కు వెళ్లాడు. లీటర్‌ మంచినూనె ప్యాకెట్‌ కొన్నాడు. చెక్‌ చేస్తే అందులో 900మిల్లీ లీటర్లు మాత్రమే ఉంది. ప్రముఖ కంపెనీ లోగోతో కూడిన ఆ నూనె తయారీ సంస్థ కూడా ప్రమాణాలు పాటించలేదని ఈ ఘటనతో తేటతెల్లమైంది.
- వెంకటరమణ భైంసా పరిసర ప్రాంతాల్లో విధి నిర్వహణలో భాగంగా ద్విచక్ర వాహనంపై గ్రామాలు తిరుగుతుంటాడు. ఒకరోజు ఓ పెట్రోల్‌ బంకుకు వెళ్లిన అతడు రెండులీటర్ల పెట్రోలు పోయించుకున్నాడు. కొద్ది కిలోమీటర్లు ప్రయాణించిన తర్వాత పెట్రోలు అయిపోయింది. అతడికి అనుమానం వచ్చి అదే పెట్రోల్‌ బంక్‌లో బాటిల్‌లో లీటర్‌ పెట్రోలు పోయించి చూడగా 80 మిల్లీలీటర్లు తక్కువగా వచ్చింది. దీంతో అతడు అవాక్కయ్యాడు.



ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నంబర్‌: 1860425333

ఫిర్యాదుల పరిష్కార సమయం: 48గంటలు

ఈ రెండేకాదు.. మరెన్నో ఘటనలు మన కళ్లముందే కనిపిస్తుంటాయి. వినియోగదారుడికి నాణ్యత ప్రమాణాలను అందించాల్సిన బాధ్యత ఆయా సంస్థలది. దాని పర్యవేక్షణ సంబంధిత ప్రభుత్వ శాఖలది. ఈ నేపథ్యంలో నేడు 'ప్రపంచ ప్రమాణాల దినోత్సవం' (వరల్డ్‌ స్టాండర్డ్స్‌ డే) సందర్భంగా ప్రత్యేక కథనం..

నిర్మల్‌ఖిల్లా: ప్రజలు అనుదినం వస్తు సేవలపై ఆధారపడుతున్నారు. ఉదయం లేచింది మొదలు ప్రతీది కొనుగోలు చేయాల్సిందే. నిత్యావసరాలైన పప్పులు, ఉప్పులు మొదలు తదితర వస్తువులన్నీ కొనుగోలు చేస్తుంటారు. మనం కొనుగోలు చేసిన వస్తువులు నాణ్యతగా ఉన్నాయా.. కొలతలు సరిగా ఉన్నాయా.. అంటే ఏమో అనుమానమే. వినియోగదారులకు ప్రామాణికమైన, నాణ్యమైన వస్తు ఉత్పత్తులను అందించేందుకు చట్టబద్ధమైన అధికారాల ద్వారా నిర్దేశించేందుకు 14.10.1946న లండన్‌లో అంతర్జాతీయ ప్రామాణీకరణ సంస్థ ఏర్పాటైంది. 25 మంది సభ్యులతో ప్రారంభించిన ఈ సంస్థలో ప్రస్తుతం 125 సభ్యదేశాలున్నాయి. 1947లో భారతదేశంలో బ్యూరో ఆఫ్‌ ఇండియన్‌ స్టాండర్స్‌ (భారతీయ ప్రమాణాల సంస్థ) చట్టాన్ని ఆమోదించి ఒక శాసనబద్ధమైన సంస్థగా మార్చారు. అప్పటి నుంచే ఐఎస్‌ఐ ముద్ర ప్రకటించబడింది. ఈ ముద్ర గల వస్తువులు నాణ్యత కలిగినవని అర్థం.

**తరచూ దృష్టికి వచ్చే అంశాలు**

- పెట్రోల్‌ బంకుల్లో డీజిల్‌, పెట్రోల్‌ అమ్మకాల్లో తేడాలు, కల్తీ.
- తినుబండారాల్లో ఒకే కంపెనీ లోగోతో నకిలీ ఆహార పదార్థాలు.
- రైతులు తమ పంట పొలాల్లో వేసే విత్తనాలు, ఎరువుల కల్తీ.
- నకిలీ కంపెనీలతో కూడిన సరుకులు.
- నూనెలు, పప్పు దినుసులు, వివిధ రకాల ఆహార పదార్థాల్లో కల్తీ.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆమోదితంతో కూడిన లైసెన్స్‌ లేకుండా నకిలీ లోగోలతో అమ్మకాలు.
- వినియోగ తేదీ దాటిన పదార్థాలు, తినుబండారాల అమ్మకాలు.

**రెండేళ్లకోసారి ప్రామాణిక ముద్రలు**

తూనిక రాళ్లకు ప్రతీ రెండేళ్లకోసారి తూనికలు, కొలతల శాఖ నుంచి ప్రామాణిక ముద్రలు వేయించుకోవాలి. ఇందుకు కొంత నగదును తూనికలు, కొలతల శాఖకు ఫీజు రూపంలో చెల్లించాలి. అదే ఎలక్ట్రానిక్‌ కాంటా అయితే ఏడాదికి ఒకసారి తనిఖీలు చేయించుకుని స్టాంపులు వేయించుకోవాలి.

### పర్యవేక్షణ ఉండాలి



జిల్లాలోని పలు ప్రాంతాల్లో బహిరంగ మార్కెట్‌లో వివిధ రకాల ఆహార పదార్థాలు, ధాన్యాలు, సాంకేతికపరమైన వస్తువులు, ముడి సరుకులు ఎన్నో నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా విక్రయిస్తున్నారు. వీటిపై సంబంధిత శాఖ ప్రత్యేక నిఘా పెట్టి అమ్మకాలను నిషేధించాలి. వీటి తయారీపై దృష్టి సారించాలి. నాణ్యతా ప్రమాణాలపై ప్రజల్లో చైతన్యం తేవాలి.

– నంద అనిల్‌, సామాజిక కార్యకర్త, దిలావర్‌పూర్‌

### తగినన్యాయం పొందవచ్చు




వినియోగదారులు మోసాలకు గురికాకుండా జిల్లా లీగల్‌ మెట్రాలజీ అధికారులు చర్యలు తీసుకుంటారు. తూనికలు, కొలతలు సరిచూసి రెండేళ్లకోసారి అధికారిక ముద్రలు వేస్తారు. ప్రజలు చెల్లించే ప్రతీ పైసాకు వస్తు సేవలు పొందేలా అవగాహన కల్పించాలి. ఈ విషయంలో ఏదైనా నష్టం జరిగితే వినియోగదారుల ఫోరం ద్వారా తగిన న్యాయం పొందవచ్చు.

– పీ వంశీకృష్ణ, న్యాయవాది, నిర్మల్‌

# నేటి భైంసా


## నాటి మహిషాపురమే



- గుట్టపై వెలసిన గట్టు మైసమ్మ
- ఏటా ఘనంగా ఉత్సవాలు
- భైంసాలో ప్రత్యేక దుర్గాదీక్షలు
- అడుగడుగునా మండపాలు

భైంసా: ఒకప్పటి మహిషాపురమే నేడు భైంసా పట్టణంగా పిలువబడుతోంది. కాలక్రమేణా మైస ఇప్పుడు భైంసాగా మారింది. చరిత్రను తెలిపే రాతితో చెక్కిన మహిషాపాదాలు ఇప్పటికీ భైంసాలో ఉన్నాయి. పట్టణంలోని కుంటగల్లిలోగల ఫిల్టర్‌ బెడ్‌ సమీపంలో ఈ పాదాలు కనిపిస్తాయి. దసరా నవరాత్రుల్లో భైంసా పట్టణంలో గత చరిత్రను ఆధారంగా చేసుకుని పూజలు చేస్తుంటారు. శనివారం అమావాస్య రావడంతోనే ఇక్కడ పూజలు ప్రారంభంకానున్నాయి. ఆదివారం నుంచి భైంసా పట్టణంలో నవరాత్రోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

**అప్పటి మహిషా.. నేటి భైంసా**



గట్టుమైసమ్మ విగ్రహం

దుర్గాదేవి మహిషా రూపంలో వెలియగా ఈ ప్రాంతాన్ని మహిషాగా నామకరణం చేశారు. నాటి కాలంలో ఈ ప్రాంతాన్ని మహిష్మతి నగరంగా పిలిచేవారని చెబుతుంటారు. రానురాను మహిషా కాస్త మైసాగా.. కాలక్రమేణా భైంసాగా రూపాంతరం చెందింది. ఇప్పటికీ మహారాష్ట్ర వాసులు ఈ పట్టణాన్ని మైసాగానే పిలుస్తుంటారు. హిందువులు ప్రతీ పండుగలోనూ పట్టణాన్ని మహిషాగా ఫ్లెక్సీల్లో రాసి శుభాకాంక్షలు తెలుపుతుంటారు.

### ఇదీ చరిత్ర..



కుంటగల్లిలో రాతితో చెక్కిన మహిషా పాదాలు

ఈ ప్రాంతంలో గతంలో మహిషాసుర రాక్షసుడు ఇక్కడి ప్రజలను కష్టాలపాలుచేసి సుఖశాంతులు లేకుండా జనజీవనాన్ని అస్తవ్యస్తం చేశాడని పురాణాల్లో రాసి ఉంది. అయితే ఇక్కడ ఉండేవారు మహిషాసుర రాక్షసుడి నుంచి విముక్తి పొందేందుకు దుర్గాదేవి ని వేడుకున్నారు. దుర్గాదేవి మహిషా అవతారంలో మహిషాసురుడిని వధించి ప్రజలను విముక్తులను చేసిందని పురాణగాథలు చెబుతున్నాయి. అప్పటి నుంచి పాడి పంటలు, ఆయురారోగ్యాలతో జీవనం గడిపే స్థానికులు ఈ ప్రాంతానికి మహిషాగా నామకరణం చేశారు. సాక్షాత్తు దుర్గాదేవే ఈ రూపంలో వచ్చి ప్రజలను ఆదుకున్నందుకు చిరకాలంగా గుర్తుండేలా అప్పటివారు రాతితో పాదాలు చెక్కించారు. రాతి పాదాలపై చెక్కిన కళాకృతులు ఇప్పటికీ కనిపిస్తాయి. ఇందుకు గుర్తుగా సమీపంలోని గుట్టపై మైసమ్మ మందిరాన్ని నిర్మించారు. ఈ ఆలయంలో దుర్గాదేవి గట్టు మైసమ్మగా పూజలందుకుంటోంది.

### ప్రత్యేక దీక్షలు..

ఆదివారం నుంచి భైంసా డివిజన్‌వ్యాప్తంగా దుర్గా దీక్షలు స్వీకరించనున్నారు. ఇక్కడి యువకులు నవరాత్రుల అనంతరం ఏటా మహా పాదయాత్రగా మహారాష్ట్రలోని తుల్జాపూర్‌కు వెళ్తుంటారు. దుర్గా దీక్షలు స్వీకరించి నవరాత్రుల అనంతరం భైంసా పట్టణం నుంచి ఏటా పాదయాత్ర బృందం తుల్జాపూర్‌కు వెళ్తుంటుంది. చదువుల తల్లి సరస్వతీ అమ్మవారు కొలువై ఉన్న బాసరకు 26 కిలో మీటర్ల దూరంలో ఉన్న భైంసా పట్టణంలో దుర్గాదేవి మైసమ్మగా ప్రత్యేక పూజలందుకుంటోంది. పట్టణానికి చెందిన రామ్‌లాల్‌ కుటుంబీకులు దశాబ్దాలుగా అమ్మవారి సేవలో ఉంటున్నారు. పట్టణంలో యువకులంతా దసరా నవరాత్రుల్లో ప్రత్యేక దీక్షలు స్వీకరిస్తారు. తొమ్మిది రోజులపాటు కాళ్లకు చెప్పులు లేకుండా పళ్లు, పలహారాలు స్వీకరించి దీక్షలు పూర్తి చేస్తారు. దీక్ష తీసుకున్న వారంతా గట్టుమైసమ్మ, దుర్గాదేవి ఆలయాల్లో సాయంసంధ్య వేళల్లో రెండు పర్యాయాలు స్నానం ఆచరించి ప్రత్యేక పూజలు చేస్తారు. ఇంతటి చరిత్ర ఉన్నందునే భైంసా పట్టణంలో వాడవాడలా దుర్గాదేవిని నెలకొల్పి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

# నగదు పట్టివేత

తానూరు: మండలంలోని బెల్‌తరోడా సరిహద్దులో ఏర్పాటు చేసిన పోలీస్‌ చెక్‌పోస్ట్‌ వద్ద శుక్రవారం నిర్వహించిన వాహనాల తనిఖీలో రూ.1.40 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సందీప్‌ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని భోకర్‌ నుంచి భైంసా వైపు వెళ్తున్న ఓ వాహనాన్ని బెల్‌తరోడా చెక్‌పోస్ట్‌ వద్ద పోలీసులు తనిఖీ చేశారు. అందులో రూ.1.40 లక్షల నగదు ఉండగా ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా రూ.50 వేలకు మించి నగదు తరలించవద్దని, అంతకంటే ఎక్కువ తీసుకువెళ్లాలంటే తప్పనిసరిగా సంబంధిత ఆధారాలు చూపాలని సూచించారు.

నిర్మల్‌ టౌన్‌: జిల్లా కేంద్రంలో శుక్రవారం ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఆదిలాబాద్‌ జిల్లా ఇంద్రవెల్లి మండలానికి చెందిన టీకం బాలు తన కారులో రూ.1.96 లక్షల నగదుతో నిర్మల్‌ బస్టాండ్‌ నుంచి ఆదిలాబాద్‌ వైపు వెళ్తుండగా స్థానిక బైల్‌ బజార్‌ వద్ద పట్టణ పోలీసులు పట్టుకున్నారు. అలాగే కొట్లకే గ్రామానికి చెందిన వెంకటరమణ మోటార్‌ సైకిల్‌ కవర్లో రూ.8 లక్షలతో నిర్మల్‌ బస్టాండ్‌ నుంచి మంచిర్యాల చౌరస్తా వైపు వెళ్తూ స్థానిక జయశంకర్‌ చౌరస్తా వద్ద పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డాడు. వీరిద్దరి డబ్బులకు ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్‌ చేసి జిల్లా ఎలక్షన్‌ అధికారికి పంపినట్లు పట్టణ సీఐ పురుషోత్తం తెలిపారు.



పట్టుకున్న నగదుతో ఎస్సై సందీప్‌


దిలావర్‌పూర్‌: మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్‌ సమీపంలో ఎస్సై యాసిర్‌ అరాఫత్‌ ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండా రూ.8,94,233 నగదు తరలిస్తున్న ఒకరిని అదుపులోకి తీసుకుని డబ్బులు స్వాధీనం చేసుకున్నారు. నిర్మల్‌ సీఐ శ్రీనివాస్‌, పోలీసులు పాల్గొన్నారు.

నర్సాపూర్‌(జి): మండల కేంద్రంలోని బస్టాండ్‌ సమీపంలో శుక్రవారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆటోలో ఆర్మూర్‌ పట్టణానికి చెందిన గంగామోహన్‌ ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.1.18 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రవీందర్‌ పేర్కొన్నారు. తదుపరి చర్యల నిమిత్తం నగదును సీటీవో నిర్మల్‌కు పంపుతున్నట్లు తెలిపారు.

### భార్య మృతికి కారకుడైన భర్తకు జైలు

నిర్మల్‌టౌన్‌: భార్య మరణానికి కారకుడైన భర్తకు నిర్మల్‌ న్యాయస్థానం ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, జరిమానా విధించింది. కోర్టు సమన్వయ అధికారి సక్రియనాయక్‌ తెలిపిన వివరాల ప్రకారం.. పెంబి మండలం మందపల్లి గ్రామానికి చెందిన తలారి ఉషన్న, శివక్క (50) దంపతులకు గ్రామ శివారులో 4.04 ఎకరాల భూమి ఉంది. ఇందులో మక్క, వరి, పసుపు సాగు చేస్తారు. 2019లో మక్క సాగు చేశారు. కంకి దశలో ఉన్న పంటను అడవి జంతువుల బారి నుంచి కాపాడుకునేందుకు ఉషన్న చుట్టూ తీగ అమర్చి విద్యుత్‌ కనెక్షన్‌ ఇచ్చాడు. 9.10.2019న ఉషన్న మరిచిపోయి రాత్రిపూట కరెంట్‌ కనెక్షన్‌ తీయకుండానే ఇంటికి వెళ్లాడు. ఆ తర్వాత ఇది గమనించని అతడి భార్య శివక్క పంట చేనుకు వెళ్లి ప్రమాదవశాత్తు కరెంట్‌ తీగలకు తగిలి షాక్‌తో మృతి చెందింది. దీనిపై మృతురాలి అన్న గంధం నర్సయ్య పెంబి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సై భవాని సేన్‌ కేసు నమోదు చేసి తదుపరి పరిశోధన నిమిత్తం అప్పటి సీఐ, ప్రస్తుత డీఎస్పీ జయరాంకు అప్పగించారు. డీఎస్పీ జయరాం పరిశోధన చేసి ఉషన్నను కోర్టులో హాజరుపరిచారు. పీపీ కల్వకుంట్ల వినోద్‌రావు 18 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నేరం రుజువు చేయగా ఉషన్నకు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.1,500 జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్‌ శుక్రవారం తీర్పునిచ్చారు.

### జ్వరంతో విద్యార్థిని మృతి



జంగుబాయి (ఫైల్‌)

ఆదిలాబాద్‌రూరల్‌: జ్వరంతో ఆదిలాబాద్‌ రూరల్‌ మండలం టెకిడిగూడ గ్రామానికి చెందిన బీర్షావ్‌–సూర్యకళ దంపతుల కుమార్తె రాయిసిడాం జంగుబాయి (14) మృతి చెందింది. వివరాలు.. జంగుబాయి మండలంలోని మామిడిగూడ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. మూడు రోజుల కిందట ఆమెకు జ్వరం రాగా కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించి జంగుబాయి శుక్రవారం మృతి చెందింది. కాగా, పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యంతోనే తమ కూతురు మృతి చెందినట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. యాజమాన్యంపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై పాఠశాల హెచ్‌ఎం అశోక్‌ను వివరణ కోరగా.. జ్వరంతో బాధపడుతున్న జంగుబాయికి స్థానికంగా చికిత్స చేయిస్తున్నామని, ఆమె తల్లిదండ్రులే వినిపించుకోకుండా ఇంటికి తీసుకువెళ్లారని తెలిపారు. కాగా, వార్డెన్‌, హెచ్‌ఎం నిర్లక్ష్యంతోనే బాలిక మృతి చెందిందని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్‌ ఆరోపించారు. బాలిక కుటుంబాన్ని పరామర్శించారు. బాధ్యులను వెంటనే సస్పెండ్‌ చేయాలని డిమాండ్‌ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.


### దొంగచింతలో ఒకరు..



లక్ష్మణ్‌ (ఫైల్‌)

ఉట్నూర్‌రూరల్‌: జ్వరంతో మండలంలోని దొంగచింత గ్రామానికి చెందిన కనక లక్ష్మణ్‌ (32) మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మణ్‌ వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. జ్వరం తీవ్రం కావడంతో గురువారం ఉట్నూర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలున్నారు.

### అప్పుల బాధతో ఆత్మహత్య



భీమన్న (ఫైల్‌)

లోకేశ్వరం: ఇంటి నిర్మాణానికి చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపంతో మండలంలోని అబ్దుల్లాపూర్‌ గ్రామానికి చెందిన సుంకరి భీమన్న (40) చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్సై దిగంబర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌ గ్రామానికి చెందిన భీమన్నకు చెందిన ఇల్లు భారీ వర్షాలకు కూలిపోయింది. దీంతో అప్పు చేసి ఇంటి నిర్మాణ పనులు చేపడుతున్నాడు. ఇందుకు చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపానికి గురయ్యాడు. గురువారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి రాత్రి వరకూ రాలేదు. అతడి ఆచూకీ కోసం వెతకగా శుక్రవారం ఉదయం గ్రామ సమీపంలోని బీబీ తలాబ్‌ చెరువులో మృతదేహం కనిపించింది. అప్పుల బాధతో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై తెలిపారు. మృతుడి భార్య భోజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# ఎన్నికల 'కిక్‌' లేనట్లే..!

- నవంబర్‌ వరకు పాత దుకాణాలకు గడువు
- కొత్తగా వైన్స్‌ దక్కించుకున్న వారిలో నిరాశ

**లెక్క తప్పింది**

భైంసాటౌన్‌: కొత్తగా మద్యం దుకాణాలు దక్కించుకున్న వారికి ఈసారి ఎన్నికలు నిరాశనే మిగిల్చనున్నాయి. మద్యం అమ్మకాలకు కిక్‌ ఇచ్చే దసరా పండుగ ఇదే నెలలో ఉండగా, నవంబర్‌లో ఎన్నికల ఉన్నాయి. నామినేషన్‌ వేసింది మొదలు పోలింగ్‌కు ముందు రోజు వరకు ఓటరు దేవుళ్లను ప్రసన్నం చేసుకునేందుకు నాయకులు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తుంటారు. ఇక మందుబాబుల గురించి చెప్పనక్కర్లేదు. ఎన్నికలు ముగిసే వరకు ప్రతి రోజూ మందు, విందుల్లో మునిగి తేలుతారు. ఎన్నికలు వచ్చాయంటే చాలు మద్యం అమ్మకాలు విపరీతంగా పెరుగుతాయి. కొత్తగా మద్యం దుకాణాలు దక్కించుకున్న వారికి మాత్రం నిరాశ తప్పేట్టు లేదు. ఎందుకంటే, నవంబర్‌ తరువాత డిసెంబర్‌లోనే కొత్త దుకాణాలు ప్రారంభం కానున్నాయి. నవంబర్‌ 30న పోలింగ్‌తో ఎన్నికల తంతు ముగియనుంది. పాత దుకాణాలకు నవంబర్‌ వరకు గడువు ఉండడంతో కొత్త దుకాణదారుల్లో నిరాశ నెలకొంది. ఎన్నికలు డిసెంబర్‌లోనే ఉంటాయనుకుని టెండర్‌లో దుకాణాలు రాని వారు రూ.లక్షల్లో గుడ్‌విల్‌ చెల్లించి దక్కించుకున్న వారున్నారు. ఇప్పుడు వారితోపాటు కొత్తగా దుకాణాలు పొందిన వారిలో నైరాశ్యం నెలకొంది.

# ఒకేరోజు రెండు పార్టీల్లోకి జంప్‌



గురువారం మధ్యాహ్నం ప్రేమ్‌సాగర్‌ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లోకి వెంకట్రామయ్య



గురువారం రాత్రి బీఆర్‌ఎస్‌ పార్టీలో చేరుతున్న వెంకట్రామయ్య

**అటు.. ఇటు**

మంచిర్యాలటౌన్‌: మంచిర్యాల పట్టణంలోని పాత మంచిర్యాలకు చెందిన రైతు సమితి మండల కన్వీనర్‌ తూముల వెంకట్రామయ్య గురువారం మధ్యాహ్నం బీఆర్‌ఎస్‌ పార్టీ నుంచి మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. అదే రోజు రాత్రి మున్సిపల్‌ చైర్మన్‌ పెంట రాజయ్య, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు తనయుడు నడిపెల్లి విజిత్‌రావు సమక్షంలో తిరిగి బీఆర్‌ఎస్‌ పార్టీలో చేరి కండువా కప్పుకున్నారు. ఒక్క రోజే అటు నుంచి ఇటు.. ఇటు నుంచి అటు మారి కండువాలు కప్పుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఎన్నికలు పూర్తయ్యే నాటికి ఇలాంటి వింతలు ఎన్ని చోటు చేసుకుంటాయో చూడాలి.

# నెత్తిన టోపీ.. ఖద్దరు చొక్కా

**ప్రత్యేకం..**



గడ్డిగారి గడ్డెన్న, మాజీ మంత్రి

భైంసా: ముథోల్‌ నియోజకవర్గ వాసుల గుండెల్లో చిరకాలం నిలిచిన మాజీ మంత్రి గడ్డిగారి గడ్డెన్న ఎప్పుడూ నెత్తిన టోపీ.. ఖద్దరు చొక్కా కళ్లజోడుతో కనిపించేవారు. రాజకీయాల్లో అరంగేట్రం చేసిన నాటి నుంచి ఏనాడూ మరిచిపోలేదు. ఈ ప్రాంతం మహారాష్ట్రకు సరిహద్దున ఉండడం.. ఈ ప్రాంతంలో ఇప్పటికీ ఇలా సంప్రదాయబద్ధంగా టోపీ ధరించే వారు కనిపిస్తారు. గ్రామ సర్పంచు నుంచి ఎమ్మెల్యే, మంత్రిగా పనిచేసిన దివంగత నేత గడ్డిగారి గడ్డెన్న ఏనాడూ ఆ టోపీ ధరించడం మరిచిపోలేదు. ఎప్పుడు చూసినా ఆయన వద్ద ఇలాంటి టోపీలు కుట్టి సిద్ధంగా ఉంచేవారు. కాంగ్రెస్‌ పార్టీలో ఎంతటివారినైనా ఆయన పేరుపెట్టి పిలిచేవారు. కాకాగా ఈ ప్రాంత వాసులకు చిరస్మరణీయులు అయ్యారు.

## క్లుప్తంగా

### జరిమానా కట్టి ఆవులను తీసుకెళ్లాలి

బోథ్: బోథ్ మండల కేంద్రంలో రోడ్లపై తిరుగుతున్న ఆవులను శుక్రవారం గ్రామ పంచాయతీలోని బంజరుదొడ్డిలో వేశారు. రోడ్లపై తిరుగుతున్న ఆవులను తీసుకెళ్లాలని పలుమార్లు చెప్పినా యజమానులు వినిపించుకోలేదని, అందుకే బంజరుదొడ్డిలో వేశామని సర్పంచ్ సురేందర్ తెలిపారు. యజమానులు రూ.1000 కట్టి వారి ఆవులను తీసుకెళ్లాలని కోరారు. మళ్లీ రోడ్లపై తిరిగితే జరిమానా విధిస్తామన్నారు. మూడు రోజుల్లో ఆవులను తీసుకెళ్లాలని పేర్కొన్నారు. లేనిపక్షంలో ఆవులను గోశాలకు తరలిస్తామన్నారు.

### బస్సును పునరుద్ధరించాలని వినతి



ఆర్టీసీ అధికారికి విన్నవిస్తున్న గంగాధర్

బోథ్: హైదరాబాద్ నుంచి బోథ్ మీదుగా సొనాల వరకు రాత్రి 9గంటల సమయంలో ఉన్న సూపర్ లగ్జరీ బస్సును పునరుద్ధరించాలని హైదరాబాద్‌లోని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పురుషోత్తం నాయక్‌ను బోథ్ వీడీసీ అధ్యక్షుడు గట్టు గంగాధర్ శుక్రవారం కలిసి విన్నవించారు. శుక్రవారం నుంచే బస్సును వేస్తామని ఆయన తెలిపారని గంగాధర్ పేర్కొన్నాడు.

### బీఆర్‌ఎస్‌కు ఎంపీటీసీ స్వర్ణలత రాజీనామా

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి ఎంపీటీసీగా, తొమ్మిదేళ్లుగా బీఆర్‌ఎస్ పార్టీలో కార్యకర్తగా పనిచేసిన జాదవ్ స్వర్ణలత, భర్త మహేష్ కదాం బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసినట్లు శుక్రవారం విలేకరులకు తెలిపారు. వ్యక్తిగత కారణాలతో బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు. రాజీనామా పత్రాన్ని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగురామన్న, ఇంద్రవెల్లి మండల అధ్యక్షుడికి అందించనున్నట్లు తెలిపారు.

### చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ యశోద

ఆదిలాబాద్‌టౌన్: చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా సాధికారత కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ యశోద అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని హార్టికల్చర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లింగ సమానత్వం, మహిళ చట్టాలు, పీసీపీ, ఎన్‌డీటీ చట్టాలు, పోష్ యాక్ట్, బాల్య వివాహాలు, వరకట్న నిరోధం తదితర చట్టాలపై విద్యార్థులకు వివరించారు. మహిళలు, యువతులను ఎవరైన ఇబ్బందులకు గురిచేస్తే సఖీ కేంద్రాన్ని, డయల్ 100, 181లపై సమాచారం అందించాలని తెలిపారు. సఖి కేంద్రం కౌన్సిలర్ నాగమణి, కృష్ణవేణి, కోటేశ్వర్, నిఖిలేశ్వర్, హార్టికల్చర్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ గజానన్ పాల్గొన్నారు.

### సీనియర్ సాఫ్ట్‌బాల్ జిల్లా మహిళ జట్టు ఎంపిక

నేరడిగొండ: మండల కేంద్రంలోని జెడ్పీఎస్‌ఎస్‌లో ఆదిలాబాద్ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జాదవ్ అనిల్, గస్కంటి గంగాధర్ సీనియర్ సాఫ్ట్‌బాల్ జిల్లా మహిళా జట్టును ఎంపిక చేశారు. శుక్రవారం పాఠశాల మైదానంలో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హన్మకొండ జిల్లా కాకతీయ యూనివర్సిటీ మైదానంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఎంపికైన మహిళా జట్టు పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ సభ్యులు గౌతమ్, రాధేశ్యామ్, సాగర్, రాజు, అనిల్, మోహన్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా



అభివాదం తెలుపుతున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: రానున్న ఎన్నికల్లో తనను ఆశీర్వదిస్తే నియోజకవర్గ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం పాత ఉట్నూర్‌లోని నివాసంలో నియోజకవర్గంలోని ఆదివాసీ సార్‌మేడిలు, ఆయా గ్రామాల పటేళ్లు, ఆదివాసీలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ తనకు టికెట్ కేటాయిస్తుందని తెలిపారు. నాయకులు ఖయ్యూం, లాజర్, సలీం, సార్‌మేడిలు పాల్గొన్నారు.



బతుకమ్మలతో విద్యార్థినులు, లెక్చరర్లు



బేల: బతుకమ్మలతో సాంస్కృతిక విభాగం ఇన్‌చార్జి పుష్ప



సంజయ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో..

# ఘనంగా బతుకమ్మ వేడుకలు



ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో..



బతుకమ్మలతో విద్యార్థినులు, లెక్చరర్లు



బతుకమ్మతో విద్యార్థిని

ఆదిలాబాద్‌టౌన్: బతుకమ్మ వేడుకలను జిల్లా కేంద్రంలోని పలు కళాశాలల్లో ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి బతుకమ్మ ఆడిపాడారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ సంజయ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాలల్లో ముందస్తు వేడుకలు నిర్వహించారు. విద్యార్థినిలు బతుకమ్మలను పేర్చి భక్తిశ్రద్ధలతో ఆడిపాడారు. విద్యార్థినిలతో పాటు మహిళ లెక్చరర్లు నృత్యాలు చేశారు. అలాగే ప్రభుత్వ సంజయ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన ఈ వేడుకల్లో కళాశాల ప్రిన్సిపల్ భరద్వాజ, లెక్చరర్లు జ్యోత్స్నరాణి, యశస్వి, హేమలత, రాజ్‌కుమార్, క్రాంతికుమార్, నీలకమల్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ అనిత, ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, సంతోష్, దయాకర్ పాల్గొన్నారు.

బేల: మండల కేంద్రంలోని కీర్తన డిగ్రీ కళాశాలలో శుక్రవారం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. కళాశాల సాంస్కృతిక విభాగం ఇన్‌చార్జి పు, ప్రిన్సిపాల్ వరప్రసాద్‌రావు, మహిళ అధ్యాపకులు సౌందర్య, ప్రియాంక, బిందు పాల్గొన్నారు.

### 15 నుంచి బ్రహ్మోత్సవాలు

బోథ్: ఈ నెల 15వ తేదీ నుంచి సొనాల రామాలయంలో 23వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ జీవి రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

### నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

బోథ్: ఎన్నికల సంఘం ఉత్తర్వుల మేరకు ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని బోథ్ సీఐ భీమేష్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ... బోథ్ సర్కిల్ పరిధిలోని బోథ్, బజార్‌హత్నూర్ మండలాల్లో అక్రమంగా మద్యం, గంజాయి విక్రయించినా, బెల్ట్ షాపులు నిర్వహించినా చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ర్యాలీలు, ధర్నాలు చేసినా, పార్టీల బ్యానర్లు కట్టినా ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనుమతి తీసుకోవాలన్నారు. స్పీకర్లు, మైక్‌లకు ముందుగానే అనుమతి తీసుకోవాలని వివరించారు.

### నగదు పట్టివేత

ఆదిలాబాద్‌టౌన్: సరైన పత్రాలు చూపించకపోవడంతో డబ్బును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. వన్‌టౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని పంజాబ్ చౌక్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టణానికి చెందిన జనగంవార్ సాయితేజ ద్విచక్ర వాహనంలో రూ.75వేల నగదు తీసుకెళ్తున్నాడు. ఆ నగదుకు సరైన పత్రాలు లేకపోవడంతో సీజ్ చేశారు.

### విద్యుత్‌షాక్‌తో ఆవు మృతి

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బంగారు గూడలో శుక్రవారం విద్యుత్ ఘాతంతో ఓ ఆవు మృత్యువాత పడింది. గ్రామానికి చెందిన కొకటే సంతోష్‌కు చెందిన ఆవు రోజు మాదిరిగానే మేతకు వెళ్లగా ప్రమాదవశాత్తు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షాక్‌కు గురై మృతి చెందింది. అధికారులు స్పందించి ఆదుకోవాలని కోరారు.

# జాతీయస్థాయిలో రాణించిన విద్యార్థి



అనికేత్‌కుమార్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

నార్నూర్: కొమురంభీం జిల్లా కాగజ్‌నగర్ ఏకలవ్య గురుకుల పాఠశాలలో చదువుతూ జాతీయ స్థాయిలో నిర్వహించిన 4వ సాంస్కృతి పోటీల్లో తెలంగాణ రాష్ట్రం పురుషుల విభాగంలో సోలో ఇంట్రుమెంటల్‌లో ప్రథమ స్థానంలో నిలిచి మొదటి బహుమతి గెలుపొందిన మండలంలోని నాగల్‌కొండ గ్రామానికి చెందిన జాదవ్ రవీందర్, శీలా దంపతుల కూమారుడు జాదవ్ అనికేత్‌కుమార్‌ను శుక్రవారం గ్రామస్తులు సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయుడు మాట్లాడుతూ ఏకలవ్య గురుకుల పాఠశాలలో చదివే విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యం, ప్రతిభను గుర్తించి వాటిలో ప్రోత్సహించడం జరిగిందన్నారు. అనికేత్‌కుమార్ గిటారు వాయించడంలో దిట్ట అన్నారు. రాష్ట్ర స్థాయి ఏకలవ్య సాంస్కృతి పోటీల్లో గెలుపొంది జాతీయ స్థాయిలో ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌లో జరిగిన 4వ జాతీయ సాంస్కృతి పోటీలో సోలో ఇంట్రుమెంట్ పురుషుల విభాగంలో రాష్ట్రం తరుపున ప్రథమ బహుమతి సాధించినట్లు తెలిపారు. సర్పంచ్ జాదవ్ సునీతనారాయణ్, ఎంపీటీసీ బాదావత్ విజయలక్ష్మి ఉత్తం ఉన్నారు.

# రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

ఉట్నూర్‌రూరల్: ఈ నెల 15, 16, 17న నిర్వహించే రాష్ట్ర విద్యా వైజ్ఞానిక 5వ మహాసభలను విజయవంతం చేయాలని డీటీఎఫ్ సంఘం నాయకులు శామ్యూల్, వీరయ్య పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం స్థానిక ప్రెస్ భవన్‌లో ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభల్లో జాతీయ విద్యావిధానం, సమాజంలో రాజకీయ, ఆర్థి క పరిస్థితులు, వ్యవసాయ రంగం, రైతాంగ ఉద్యమాలు, పాలనలో ప్రజల హక్కులు సాహిత్యం, మహిళలు, సంస్కృతి రంగంలో తిరోగమన దోరణులు, పాఠశాలల్లో విద్యారంగంలో సవాళ్లు, కార్పొరేటీకరణతో దళితులు, ఆదివాసీలు తదితర అంశాలపై చర్చ ఉంటుందన్నారు. రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలను మహబూబ్‌నగర్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.


### అన్యాయం చేస్తే సహించం



నిరసనలో దళిత బీఆర్‌ఎస్ నాయకులు

ఉట్నూర్‌రూరల్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల్లో కొందరు పార్టీ నేతల ప్రమేయంతో దళితులకు అన్యాయం చేస్తే సహించేది లేదని దళిత బీఆర్‌ఎస్ నాయకులు జగ్జీవన్, వెంకటేశ్, తబితా అన్నారు. వెంటనే దళితబంధును ఇవ్వాలని డిమాండ్‌తో శుక్రవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో దళితబంధు రెండవ విడత లబ్ధిదారుల లిస్టును ఫైనల్ చేస్తూ కలెక్టర్‌ల ద్వారా ఆమోదించారని, కేవలం ఖానాపూర్ నియోజకవర్గం దళితబంధు లిస్టును ఆమోదించకుండా కాలయాపన చేయడం సమంజసం కాదన్నారు. నియోజకవర్గంలోని ఉట్నూర్ మండలంలో దళితులకు అన్యాయం చేయడం సరికాదన్నారు. అనంతరం బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. దళిత బీఆర్‌ఎస్ నాయకులు ల్మోపతి, ముకుంద్, శ్రీరంగ్, గౌతమ్, కాంబ్లే ప్రజ్ఞశీల్, పవార్ ప్రథం, రంజనాబాయి, తిరుపతి, ధన్‌రాజవ్ పాల్గొన్నారు.

### గ్రామాల్లో 'జాన్సన్' పర్యటన



దస్నాపూర్‌లో సన్మానం చేస్తున్న గ్రామస్తులు

ఇంద్రవెల్లి: కారు గుర్తుకు ఓటు వేసి తనను ఆశీర్వదించాలని ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్ అన్నారు. శుక్రవారం జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్‌తో కలిసి మండలంలోని పిట్టబోంగరం, దస్నాపూర్, మెండపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ప్రజలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజలకు అడిగి తెలుసుకున్నారు.

# బెల్ట్‌షాపులపై పోలీసుల దాడులు



జైనథ్: నిందితుడితో ఎక్సైజ్ పోలీసులు



గుడిహత్నూర్: పట్టుకున్న మద్యంతో పోలీసులు

ఇంద్రవెల్లి: మండలంలోని రూప్‌సింగ్‌తండా, దేవాపూర్ గ్రామాల్లో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై శుక్రవారం పోలీసులు దాడులు నిర్వహించారు. రూప్‌సింగ్‌తో జైసింగ్ నిర్వహిస్తున్న బెల్ట్‌సాపులో రూ.2వేల విలువైన మద్యం, దేవాపూర్ ఆకుధారి లింగన్న నిర్వహిస్తున్న బెల్ట్ షాపులో రూ.28 వందల విలువ గల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై. సునీల్ తెలిపారు. మద్యం బాటిళ్లను ఎక్సైజ్ శాఖకు అప్పగించినట్లు పేర్కొన్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఉన్నారు.

**మద్యం పట్టివేత**

గుడిహత్నూర్: ఎన్నికల నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో పోలీసులు గ్రామాల్లో తనిఖీలు ఉధృతం చేస్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని సీతాగోంది, గురుజా, శాంతపూర్ గ్రామాల్లో అక్రమంగా బెల్టు షాపులు ఏర్పాటు చేసుకుని విక్రయిస్తుండగా పోలీసులు ఆయా దుకాణాల్లో సోదాలు నిర్వహించి సుమారు రూ.24వేల విలువ గల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు పోలీసు స్టేషనులో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దీంతో పాటు నేరడిగొండ తండాలో 5 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఇమ్రాన్ తెలిపారు. వీరిని తహసీల్దార్ వద్ద బైండోవర్ చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఆయనతో పాటు ఏఎస్సై బలిరాం, సిబ్బంది పాల్గొన్నారు.

**జైనథ్‌లో..**

జైనథ్: మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న బెల్ట్‌షాప్‌లపై పోలీసులు దాడులు నిర్వహించారు. శుక్రవారం మండలంలోని గిమ్మ, మేడిగూడ, జామ్ని, మాంగుర్ల, పార్డి-కే, కంఠ, అడ గ్రామాల్లోని బెల్ట్‌షాప్‌లపై దాడులు నిర్వహించి మొత్తం రూ. 52,449 విలువ చేసే 79లీటర్ల మద్యం సీజ్ చేశారు. నిర్వహకులపై కేసులు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ కోల నరేష్, ఎస్సై పురుషోత్తం తెలిపారు.

**కారు, దేశీదారు సీజ్..**

మండలంలోని పిప్పర్‌వాడ చెక్‌పోస్ట్ వద్ద శుక్రవారం కారు, 750 ఎం.ఎల్ పరిమాణం గల 3 దేశీదారు సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం నిజామాబాద్‌కు చెందిన బద్దం రాజశేఖర్ కారులో మహారాష్ట్ర వైపు నుంచి తెలంగాణలోకి వస్తున్నాడు. కాగా పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా వద్ద ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహించగా కారులో మూడు దేశీదారు సీసాలు లభించాయి. నిందితుడిని అదుపులోకి తీసుకొని కారు, దేశీదారు సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని కొత్తగూడలో నిర్వహిస్తున్న బెల్టుషాప్‌లపై శుక్రవారం ఎస్సై ముజాహిద్ దాడి చేశారు. రెండున్నర లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని బెల్టు షాప్ నిర్వాహకునిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపాడు. మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంనగర్, 170 కాలనీలోని గాయత్రినగర్‌లో బెల్టు షాప్‌పై ఎస్సై విష్ణువర్ధన్ దాడి చేసి మద్యం బాటిళ్లను సీజ్ చేయడంతో పాటు నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు తెలిపాడు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్ట రీత్య చర్యలు తప్పవని హెచ్చరించారు.

**105 దేశీదారు బాటిళ్లు పట్టివేత..**

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని వడ్డెర కాలనీలో ఎక్సైజ్ అధికారులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో కాలనీకి చెందిన మంజుల ఆశ అనే మహిళ దేశీదారు విక్రయిస్తుండగా పట్టుకున్నారు. ఆమె వద్ద నుంచి 105 దేశీదారు బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు సంధ్యారాణి, సంజీవ్ కుమార్, సిబ్బంది వెంకటగిరి, సుధాం, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

### ఆధ్యాత్మికతతోనే ప్రశాంతత



పాల్గొన్న అనిల్‌జాదవ్, మాజీ ఎంపీ నగేశ్

బోథ్: ఆధ్యాత్మికతతోనే మనస్సుకు ప్రశాంతత లభిస్తుందని బోథ్ బీఆర్‌ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్, మాజీ ఎంపీ నగేష్ అన్నారు. మండలంలోని గుర్రాలతండాలోని ఓ జిన్నింగ్ మిల్లులో ఆరు రోజులుగా నిర్వహించిన శ్రీమద్ భాగవత్ కథ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా వారు యశస్వి శ్రీసంత్ దక్షిత్ మహారాజ్ ఆశీర్వాదం తీసుకున్నారు. బోథ్ జెడ్పీటీసీ సభ్యురాలు సంధ్యారాణి, తాంసి జెడ్పీటీసీ రాజు, భీంపూర్ జెడ్పీటీసీ సుధాకర్ ఉన్నారు.

# అలరించిన ఫ్రెషర్స్ డే వేడుకలు



విద్యార్థినులతో కలిసి నృత్యాలు చేస్తున్న లెక్చరర్లు



స్టెప్పులేస్తున్న విద్యార్థినులు

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్‌డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. విద్యార్థులు సినీ, జానపద గీతాలపై నృత్యాలు చేస్తూ సందడి చేశారు. కేరింతల మధ్య కార్యక్రమం సాగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాలను నెరవేర్చుకోవాలన్నారు. సీనియర్ల పట్ల జూనియర్ విద్యార్థులు మర్యాదపూర్వకంగా మెదలాలని సూచించారు. అలాగే సీనియర్‌లు సైతం జూనియర్‌లకు సలహాలు, సూచనలు అందిస్తూ చదువులో రాణించాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ జాకిర్ హుస్సేన్, లెక్చరర్లు సంతోష్‌రావు, దయాకర్, ప్రతాప్ సింగ్, జగ్‌రాం, అఫ్రష్, విజయ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**దేశభక్తిని పెంపొందించుకోవాలి**

ఇచ్చోడ: ప్రతీ విద్యార్థి దేశభక్తిని పెంపొందించుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గణేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కళాశాల్లో ఏర్పాటు చేసిన మేరా మిట్టి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా మట్టిని సేకరించి ఢిల్లీకి పంపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ప్రభాకర్‌రెడ్డి, హెచ్. సత్యనారాయణరావు, అధ్యాపకులు సోమన్న, రాజేశ్వర్, బాలాజీ, భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

**కళాశాలలో అమృత కళశయాత్ర**

బేల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులలో, యువతలో దేశభక్తిని పెంపొందించడంతో పాటు అమరవీరుల త్యాగాల జ్ఞాపకంగా మేరి మట్టి మేరా దేశ్‌లో భాగంగా శుక్రవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అమృత కళశయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటి, విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అమిడ్‌వార్ వినోద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రూపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

**యువకులకు సన్మానం**

తాంసి: మండల కేంద్రానికి చెందిన యువకులు ఇటీవల వెలువడిన కానిస్టేబుల్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచి ఉద్యోగం సాధించారు. ఉద్యోగాలు సాధించిన గ్రామ యువకులను గ్రామస్తులు శుక్రవారం సన్మానించారు. ఉద్యోగాలు సాధించిన గ్రామానికి చెందిన చిల్కూరి సాయి చరణ్‌రెడ్డి, రాహుల్, రాజులను పూలమాల శాలువాతో సన్మానించారు. గ్రామస్తులు బెల్లపు గంగారం, సర్పంచ్ కృష్ణ, వీడీసీ అధ్యక్షుడు రాంరెడ్డి, గ్రామపెద్దలు మహేందర్ రెడ్డి, ఆశారెడ్డి, రామన్నయాదవ్ ఉన్నారు.

**పోలీసు విధులకు సహకరించిన ఎమ్మెల్యే రామన్న**

జైనథ్: తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు వద్ద 44వ నంబరు జాతీయ రహదారిపై పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద విధి నిర్వహణలో ఉన్న పోలీసులు ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న వాహనాన్ని తనిఖీ చేశారు. శుక్రవారం మహారాష్ట్రలోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్న ఎమ్మెల్యే పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా మీదుగా ఆదిలాబాద్‌కు వచ్చేటప్పుడు చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసులు కారును ఆపి, తనిఖీలు నిర్వహించారు.

**బాధిత కుటుంబానికి పరామర్శ**

బోథ్: బోథ్ మాజీ సర్పంచ్ మంగారపు సునీత భర్త రాములు ఇటీవల అనారోగ్యంతో చనిపోయాడు. బీఆర్‌ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ శుక్రవారం సునీతను పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సంధ్యారాణి, మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, జెడ్పీ కో -ఆప్షన్ సభ్యులు తాహెర్ బిన్ సలాం, సర్పంచ్ సురేందర్, పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్, ఆత్మ చైర్మన్ సుభాష్ పాల్గొన్నారు.

**అధ్వానంగా అంతర్రాష్ట్ర రోడ్డు...**

తాంసి: భీంపూర్ మండలంలోని ధనోర నుంచి కరంజి(టి) వరకు ఉన్న అంతర్రాష్ట్ర రహదారి అధ్వానంగా తయారైంది. అంతర్రాష్ట్ర రోడ్డు పలుచోట్ల గుంతలుగా మారింది. తారులేచి మొత్తం కంకరరాళ్లు బయటకొచ్చాయి. ఈ రోడ్డును చూస్తే బీటీ రోడ్డు లేక మట్టి రోడ్డు అనే సందేహం కలుగుతుంది. రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతూ రవాణా కొనసాగిస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి రోడ్డు దెబ్బతిన్న పలుచోట్ల మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

**నేడు అనిల్‌జాదవ్ రాక**

ఇచ్చోడ: మండల కేంద్రంలోని అడేగామ(బి) గ్రామానికి శనివారం బోథ్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్‌జాదవ్ రానున్నట్లు ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి తెలిపారు. ఉయదం 8గంటలకు అడేగామ గ్రామంలో అనిల్ జాదవ్‌తో పాటుగా బోథ్ అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జి గోడం నగేష్ హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. కార్యకర్తలు, నాయకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

### 'బతుకమ్మ అంటే మాకు గౌరవం'

బోథ్: బతుకమ్మ అంటే ఆదివాసీలకు గౌరవం ఉందని ఆదివాసీ నాయకులు పేర్కొన్నారు. పార్డి బి రాయిసెంటర్ నాయకులు శుక్రవారం సొనాలలో మాట్లాడుతూ... ఆదివాసీ సాంప్రదాయంలో బతుకమ్మ పండుగ లేదన్నారు. ఈ కార్యక్రమంలో రాయిసెంటర్ గీతాధర్ ఆత్రం గంగాధర్, ఐటీడీఏ డైరెక్టర్ మేస్రం భూమన్న, లాలూరాం, సర్పంచ్ మారుతి, సిడాం భగవాన్, దత్తు, మదన్, సీతారాం, పురుషోత్తం, హేమన్ రావ్, జైతు పటేల్ ఉన్నారు.